
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
5
అనంతపురం
జిల్లా వార్తలు
సోమవారం 10 మార్చి 2025





చిన్నారుల సంబరం



టవర్‌క్లాక్ వద్దకు పెద్దసంఖ్యలో చేరిన అభిమానులు



బాణసంచా వెలుగులు..





జాతీయ పతాకంతో..



ఈలలు.. కేరింతలు..

చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో టీమిండియా ఘన విజయం

అనంతలో అంబరాన్నంటిన సంబరాలు

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ విజేతగా భారత్ నిలవడంతో జిల్లాలో సంబరాలు అంబరాన్నంటాయి. దుబాయ్ వేదికగా ఆదివారం నిర్వహించిన ఫైనల్ పోటీలో భారత క్రికెట్ జట్టు న్యూజిల్యాండ్ జట్టును నాలుగు వికెట్ల తేడాతో ఓడించింది. దీంతో క్రీడాభిమానులు జాతీయ జెండాలు పట్టుకుని, పెద్దసంఖ్యలో రోడ్ల పైకి వచ్చారు. టపాసులు పేల్చుతూ, కేరింతలు కొడుతూ సంబరాలు చేసుకున్నారు. ముఖ్యంగా జిల్లా కేంద్రంలోని క్లాక్‌టవర్ సర్కిల్‌కు ఆదివారం రాత్రి మ్యాచ్ ముగిశాక అసంఖ్యాకంగా యువత చేరి ఈలలు, కేకలతో హోరెత్తించారు. త్రివర్ణ పతాకాన్ని చేతబట్టి, మోటారు బైకులపై తిరుగుతూ సందడి చేశారు. క్రీడాభిమానుల సందడితో క్లాక్‌టవర్ ప్రాంతం కిక్కిరిసిపోయింది.



ఉరవకొండలో సంబరాలు





యువకుల ఆనందం

నేడు కదిరికి నారా లోకేశ్

ఖాద్రీశుడికి పట్టువస్త్రాలు సమర్పించనున్న మంత్రి

కదిరి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మానవ వనరులు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ సోమవారం పట్టణానికి రానున్నారు. శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామికి ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించను న్నారు. ఖాద్రీశుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీవారి కల్యాణోత్సవానికి హాజరు కానున్నారు. మంత్రి హోదాలో ఆయన మొదటిసారిగా కదిరికి వస్తున్నారు.



యువగళం పాదయాత్రలో లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకున్న నారా లోకేశ్

ముచ్చటగా మూడోసారి..

నారా లోకేశ్ ముచ్చటగా మూడోసారి కదిరికి వస్తున్నారు. యువగళం పాదయాత్రలో భాగంగా కదిరికి వచ్చారు. తరువాత ఎన్నికల ముందు మరోసారి పర్యటించారు. ప్రస్తుతం మంత్రి హోదాలో నరసింహస్వామి ఆలయానికి విచ్చేస్తున్నారు. యువగళం పాదయాత్రలో కదిరి ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో దగాపడిన ప్రజలు తమ సమస్యలు చెప్పుకున్నారు. పాదయాత్ర 600 కిలోమీటర్ల మైలురాయి రాత్రాపల్లి వద్ద ఏర్పాటు చేశారు. ఈప్రాంతాన్ని టెంపుల్ సర్క్యూట్‌గా గుర్తించి, రూ.వందకోట్లతో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రసుత్తం ఆ హామీ అమలుపై కదిరి ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. నారా లోకేశ్‌కు ఘనంగా స్వాగతం పలికేందుకు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు.

నారా లోకేశ్ పర్యటన షెడ్యూల్ ఇదీ..

- సోమవారం సాయంత్రం 4.20కి విజయవాడ విమానాశ్రమయం నుంచి బయల్దేరతారు.
- సాయంత్రం 5 గంటలకు సత్యసాయి విమానాశ్రయం చేరుకుంటారు.
- 5.15కి విమానాశ్రయం నుంచి కదిరికి ప్రయాణం
- 6.15కి కదిరిలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం చేరుకుంటారు.
- 7నుంచి 9 గంటల వరకు శ్రీవారి కల్యాణోత్సవంలో పాల్గొంటారు.
- 9గంటలకు శ్రీవారి దేవాలయం నుంచి కడపకు బయల్దేరి వెళ్తారు.





అశేష జనసందోహం మధ్య ముందుకు సాగుతున్న రథం



ఉత్సవమూర్తుల ఊరేగింపులో ఉత్తరాధికారి, ఏసీ, టీడీపీ నాయకులు

నేత్రపర్వంగా రథోత్సవం

శివనామస్మరణతో మార్మోగిన గవిమఠం ప్రాంతం

ఉరవకొండ, మార్చి 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గవిమఠ స్థిత చంద్రమౌళీశ్వర స్వామి రథోత్సవం ఆదివారం నేత్రపర్వంగా సాగింది. ఉత్సవాల్లో భాగంగా ఉదయం చంద్రమౌళీశ్వర స్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తిని పీఠాధిపతి చెన్నబసవ రాజేంద్రస్వామి ఆధ్వర్యంలో మేళతాళాల మధ్య ఊరేగింపుగా తీసుకువచ్చి రథంపై కొలువుదీర్చారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో రథం అలంకరణ కోసం ప్రత్యేక పూల హారాలను తెప్పించారు. గజలక్ష్మి (ఏనుగు)తోపాటు, గ్రామపంచాయతీ నుంచి గవిమఠం వరకూ పూలహారాలను ఊరేగింపుగా తెచ్చారు. రథాన్ని అశేష జనసంద్రం నడుమ గవిమఠం నుంచి ఎదురుబసవన్న గుడి వరకూ లాగారు. శివనామస్మరణతో గవిమఠం ప్రాంతమంతా మార్మోగింది. భక్తులు రథంపైకి పండ్లు విసిరి మొక్కులు తీర్చుకున్నారు. తిరిగి రథాన్ని యథాస్థితికి చేర్చారు. ఈ రథోత్సవాన్ని తిలకించడానికి జిల్లా నలుమూలలనంచే కాకుండా బళ్లారి, టుంకూరు తదితర ప్రాంతాలనుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. పీఠాధిపతి ఆధ్వర్యంలో భక్తి ప్రవచనములు, ధార్మిక, ఆధ్యాత్మిక ప్రబోధనా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఉత్తరాధికారి కరిబసవరాజేంద్రస్వామి, ఆదోని చౌకిమఠం పీఠాధిపతి కల్యాణ్‌స్వామి, గవిమఠం సహాయకమిషనర్ రాణి, తహసీల్దార్ మహబూబ్ బాషా, ఏపీఐడీసీ మాజీ డైరెక్టర్ దేవినేని పురుషోత్తం, టీడీపీ మండల కన్వీనర్ విజయ్‌భాస్కర్, మాజీ జడ్పీటీసీ గుర్రం సుధాకర్, నాయకులు ప్యారంకేశవానంద, గోవిందు, యర్రగుంట్ల వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

కసాపురం ఆలయం ఆధ్వర్యంలో పట్టువస్త్రాల సమర్పణ

చంద్రమౌళీశ్వరస్వామి రథోత్సవాన్ని పురస్కరించుకుని కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయం ఆధ్వర్యంలో స్వామి వారికి పట్టువస్త్రాలను సమర్పించారు. ఆలయ సూపరింటెండెంట్ వెంకటేశులు, సిబ్బంది నాగేశ్వర్‌రెడ్డి, వేమన్న పట్టువస్త్రాలను ఊరేగింపుగా తీసుకువచ్చి ఆలయంలో పీఠాధిపతికి అందజేశారు. ప్రతిఏటా రథం చక్రాలకు తెడ్లు వడ్డెర్ల సేవాసమితి ఆధ్వర్యంలో వేయ డం ఆనవాయితీగా వస్తోంది. దీంతో ఆదివారం వారు తెడ్లను ఊరేగింపుగా రథం వరకూ తీసుకెళ్లారు.



పట్టువస్త్రాలను తీసుకొస్తున్న ఆలయ అధికారులు



బాహుబలి..

యాడికి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వెలసిన శ్రీ శివకేశవస్వామి (చెన్నకేశవస్వామి) బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాతిగుండు ఎత్తే పోటీలు ఉత్సాహంగా సాగాయి. కర్ణాటక రాష్ట్రం కప్పగల్లు గ్రామానికి చెందిన కర్ణ మొదటి బహుమతి గెలుపొందాడు. రామతీర్థం గ్రామానికి చెందిన రాజశేఖర్ రెండు, గోసానిపల్లి వాసి చందు వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచారు.

రాతిగుండు ఎత్తుతున్న పోటీదారుడు

నేడు కలెక్టరేట్‌లో ప్రజాఫిర్యాదుల

పరిష్కార వేదిక

అనంతపురం టౌన్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ప్రతివారం నిర్వహిస్తున్న ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికను సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామన్నారు. అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని అన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అయోమయం..!

టీచర్ల సీనియారిటీ జాబితాలో ట్విస్టులు

సీనియర్ల కంటే జూనియర్లే ముందుకు..

డీఎస్సీ, ర్యాంకు, మేనేజ్‌మెంట్‌పై అభ్యంతరాలు

సైన్స్‌సెంటర్‌కు క్యూ కట్టిన ఉపాధ్యాయులు

నేటి సాయంత్రంతో గడువు పూర్తి

(వివరాలు 7లో..)

యథేచ్ఛగా ఆక్రమణ..!

లే అవుట్ ముసుగులో ప్రభుత్వ భూమి కబ్జా



ప్రభుత్వ స్థలంలో వైసీపీ నేత కట్టిన షెడ్లు

- కురుగుంటలో వైసీపీ నాయకుడి నిర్వాకం
- 30 సెంట్ల ప్రభుత్వ భూమికి ఎసరు
- షెడ్లు వేసి హద్దుల ఏర్పాటు
- పట్టించుకోని అధికారులు

అనంతపురం రూరల్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): నగరానికి కూత వేటు దూరంలో యథేచ్ఛగా భూములను ఆక్రమించుకుంటున్నా అధికారులు మిన్నకుండిపోతున్నారు. అనంతపురం రూరల్ మండలం కురుగుంట గ్రామంలో ప్రతిపక్ష పార్టీకి చెందిన పేరుమోసిన నాయకుడు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకున్నాడు. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ భూమి కబ్జా చేసి అంతటితో ఆగకుండా కొన్ని షెడ్లు కట్టేశాడు. మరి కొంత బండలు పాతి..ఇంకొంత ఫెన్సింగ్ వేశాడు. కురుగుంట గ్రామ సర్వే నెంబరు 90-4, 4ఎలో సదరు నాయకుడు నాలుగేళ్ల కిందట లే అవుట్ వేశాడు. అది కూడా అనధికార లేఅవుటే. గ్రామ పంచాయతీకి స్థలం వదలేదు. పంచాయతీ, అహుడా అనుమతులు తీసుకోలేదు. అధికారం ఉండడంతో లేఅవుట్ వేసి విక్రయాలు చేశాడు. ఆ లేవుట్, వైఎస్సార్ కాలనీ మధ్య సర్వే నెంబరు-91లో 30సెంట్ల మేర ప్రభ్వుత భూమి ఉంది. ఆ భూమిని ఆక్రమించేశాడు. ప్రస్తుతం అక్కడ ప్రైవేట్ స్థలం సెంటు రూ.4నుంచి రూ.5లక్షలకు పైగానే పలుకుతోంది. ఈలెక్కన రూ.కోటికి పైగా విలువచేసే ప్రభుత్వ భూమిని ఆక్రమించి సొమ్ము చేసుకోవడం గమనార్హం. సదరు నాయకుడు వేసిన లే అవుట్ లో ప్లాట్లు సెంటు రూ.4లక్షలకు పైగానే విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది.

నిద్రమత్తులో రెవెన్యూ అధికారులు

నగరానికి అత్యంత దగ్గరలోని ప్రాంతంలోనే ఈ విధంగా ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నా రెవెన్యూ అధికారులు నిద్రమత్తులో జోగుతున్నారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకున్న వ్యక్తి పెద్ద భూస్వామే. పేదలు ఒక సెంటు స్థలంలో గుడిసెలు వేసుకుంటే చర్యలు తీసుకునే రెవెన్యూ అధికారులు.. ఈ పెద్ద భూస్వామి విషయంలో పట్టించుకోలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

నా దృష్టికి రాలేదు..

కురుగుంట వైస్సార్ కాలనీలో ప్రభుత్వ భూమి ఆక్రమించుకున్న విషయం నా దృష్టికి రాలేదు. పూర్తి స్థాయిలో విచారిస్తాం. ప్రభుత్వ భూమిని ఆక్రమించుకోవడం తప్పు. విచారణలో అక్రమాలు తేలితే.. బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.



\- మోహన్‌కుమార్, తహసీల్దార్, అనంతపురంరూరల్



	ఇఫ్తార్	సెహరీ
	6.30	5.15
	సోమవారం సాయంత్రం	మంగళవారం ఉదయం



ఉష్ణోగ్రతలు ఆదివారం	
గరిష్ఠం	38.0
కనిష్ఠం	21.0

ప్రయాణికులకు విజ్ఞప్తి..!

అభిప్రాయ సేకరణకు క్యూఆర్ కోడ్

కొత్తగా ప్రవేశపెట్టిన కూటమి ప్రభుత్వం

సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చు



క్యూఆర్‌కోడ్‌ను స్కాన్ చేసి ప్రయాణికులకు చూపుతున్న కండక్టర్

ధర్మవరం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ప్రయాణాల్లో ఎదురయ్యే ఇబ్బందులు, అసౌకర్యాలు, సమస్యలను ప్రయాణికుల నుంచి తెలుసుకునేందుకు ఆర్టీసీ సరికొత్త విధానాన్ని అమలుల్లోకి తెచ్చింది. బస్సుల్లో ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించేందుకు క్యూఆర్‌కోడ్ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ విధానం ద్వారా బస్టాండ్‌లో ప్రయాణికులకు కల్పిస్తున్న వసతులపై సమాచారం నేరుగా ఏపీ సర్వే సైట్‌కు చేరుతుంది. బస్టాండులో పరిశుభ్రత, తాగునీటి వసతి, మరుగుదొడ్లు, బస్సుల్లో వసతులు, సిబ్బంది పనితీరు ఇతరత్రా సౌకర్యాల కల్పనలో ఎలాంటి లోపాలున్నా ప్రయాణీకులు ఆర్టీసీ అధికారులకు తెలిపేందుకు కూటమి ప్రభుత్వం ఈ విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చింది. దీనికి సంబంధించి క్యూఆర్‌కోడ్ రూపొందించి విస్తృత ప్రచారం కల్పిస్తోంది. బస్టాండుల్లో ప్రయాణికులు కూర్చునేప్రాంతాలు, ప్లాట్‌పామ్‌లు, రిజర్వేషన్‌కౌంటర్, తాగునీటి కొళాయిలు ఇలా ప్రతిచోటా క్యూఆర్ కోడ్ చిత్రాలు ప్రదర్శిస్తున్నారు.

మొబైల్ ద్వారా

మొబైల్ ద్వారా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయగానే ఏపీజీఓజీ సర్వేకామ్ అనే లింక్ ఓపెన్ అవుతుంది. అందులో ఆర్టీసీ బస్‌స్టేషన్‌పై సర్వే అని ఐదు అంశాలు ఉంటాయి. వాటిని పూర్తి చేసి సబ్‌మిట్ చేయగానే నేరుగా ఏపీ సర్వే సైట్‌కు ఫిర్యాదు చేరుతుంది.

ఇవీ అంశాలు

బస్‌స్టేషన్‌పై పూర్తి అనుభవాన్ని తెలుపగలరు. పరిశుభ్రత, కూర్చొనే సదుపాయం, నిరీక్షణ కేంద్రాలు, నిర్వహణతో మీరు సంతృప్తి చెందారా? తాగునీరు అందుబాటులో ఉందా? మరుగుదొడ్ల సౌకర్యం సరిగా ఉందా, బస్సుల షెడ్యూల్, రూట్ గురించిన సమాచారం స్పష్టంగా ప్రదర్శిస్తున్నారా అనే ప్రశ్నలకు అవును కాదు , బాగుంది, బాగులేదనే జవాబులు ఇవ్వాల్సిఉంటుంది. ఆయా వివరాలు ఉన్నతాధికారుల దృష్టికి చేరుతాయి. ఆ వెంటనే స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు.

క్రైం న్యూస్

గొలుసు అపహరణ

బుక్కరాయసముద్రం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బి.కొత్తపల్లి వద్ద వనజ అనే మహిళ మెడలో నుంచి బంగారు గొలుసును గుర్తు తెలియని దుండగుడు లాక్కెళ్లాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... అనంతపురం నగరానికి చెందిన రమేష్, అతడి భార్య వనజ శింగనమల మండలం లోలూరు వద్ద జాతీయ రహదారి పక్కనే హోటల్ నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయం వనజ, ఆమె కుమార్తె అనంతపురంలో హోటల్‌కు సంబంధించి కూరగాయలు తీసుకున్నారు. గుత్తి రోడ్డుమీదగా హోటల్‌కు ద్విచక్రవాహనంలో బయల్దేరారు. బి.కొత్తపల్లి వద్దకు రాగానే గుర్తుతెలియని దుండగుడు బైక్‌లో వచ్చి వనజ మెడలో ఉన్న నాలుగు తులాల బంగారు గొలుసును అపహరించాడు. అనంతపురం నుంచే దుండగుడు వారిని అనుసరించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ కరణాకర్ బాధితురాలితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతపురంలో సీసీ కెమెరాల ద్వారా వీక్షించి కేసును వేగవంతం చేయనున్నట్లు సీఐ తెలిపారు.

ఈతకెళ్లి ఇద్దరు విద్యార్థుల మృతి



అయాన్, రిహాన్ మృతదేహాలు

హిందూపురం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముక్కడిపేటకు చెంది సుహేల్ కుమారుడు అయాన్ (11), ఆటోనగర్‌కు చెందిన జాకీర్ కుమారుడు రిహాన్(13) ఆదివారం ఈతకెళ్లి, చెరువులో మునిగి మరణించారు. హిందూపురం టూటౌన్ సీఐ కరీముల్లా తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అయాన్, రిహాన్ ఆరు, ఏడు తరగతులు చదువుతుండేవారు. ఇద్దరూ మిత్రులు. ఆదివార పాఠశాలకు సెలవు కావడంతో మధ్యాహ్నం ఆడుకుంటూ ఆటోనగర్ సమీపంలోని సడ్లపల్లి చెరువులోని గుంతలోకి ఈతకెళ్లారు. గుంతలో నీటి లోతును అంచనా వేయకుండా దిగి మునిగిపోయారు. నీటి కిందిభాగంలో బురద ఉండటంతో పైకి తేలే అవకాశం లేకుండాపోయింది. వారివెంట వెళ్లిన మరో బాలుడు నీటి కుంట నుంచి పరుగులు తీసి, ఆటో నగర్‌లో కుటుంబ సభ్యులకు విషయం చెప్పాడు. వారు వెంటనే నీటి గుంత వద్దకు చేరుకున్నారు. పోలీసులు, స్థానికులు తరలివెళ్లి నీటి కుంటలో విద్యార్థులను వెలికితీశారు. అప్పటికే ఇద్దరు మృతిచెందినట్లు సీఐ తెలిపారు. మృతదేహాలను హిందూపురం ఆస్పత్రికి తరలించి, పోలలీససులు కేసు నమోదు చేశారు. విద్యార్థుల మృతితో వారి కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

అయోమయం..!

టీచర్ల సీనియారిటీ జాబితాలో ట్విస్టులు

సీనియర్ల కంటే జూనియర్లే ముందుకు..

డీఎస్సీ, ర్యాంకు, మేనేజ్‌మెంట్‌లపై అభ్యంతరాలు

సైన్స్‌సెంటర్‌కు క్యూ కట్టిన ఉపాధ్యాయులు

నేటి సాయంత్రంతో గడువు పూర్తి



అభ్యంతరాలను పరిశీలిస్తున్న డీఈఓ ప్రసాద్‌బాబు, వినతులు ఇస్తున్న ఉపాధ్యాయులు

అనంతపురం విద్య, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): సీనియారిటీ జాబితాలో ఉపాధ్యాయులకు ట్విస్టులు కనిపిస్తున్నాయి. ముందుండాల్సిన సీనియర్ టీచర్లు జూనియర్ల కంటే వెనకున్నారు. డీఎస్సీ ఒకటే అయినా తక్కువ ర్యాంకు ఉన్న టీచర్ కంటే ఎక్కువ ర్యాంకు ఉన్న టీచర్లు జాబితాలో ముందు వరుసలో ఉన్నారు. టీచర్ల ర్యాంకులు, మేనేజ్‌మెంట్, సీనియారిటీ స్థానం, డీఎస్సీ ఇయర్ ఇలా పలు అంశాల్లో తప్పులు దొర్లాయని టీచర్లు, సంఘాల నేతలు గగ్గోలు పెడుతున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు 15,059 మంది టీచర్లతో రూపొందించిన తాత్కాలిక సీనియారిటీ జాబితాలో అనేక పొరపాట్లు ఉన్నాయంటూ పెదవి విరుస్తున్నారు. మరోవైపు అధికారులు సైతం టీచర్లు ఇచ్చిన 'టిస్'లోనే అనేక తప్పులు నమోదు చేశారని, అందువల్లే ఈ తప్పులు వచ్చాయంటూ అధికారులు మండిపడుతున్నారు. వెరసి టీచర్లలో ఈ జాబితాపై అయోమయం నెలకొంది. సీనియారిటీ జాబితాపై ఈ నెల 4వ తేదీ నుంచి నుంచి ఇప్పటి వరకూ 455 వరకూ అభ్యంతరాలు వచ్చాయి. సోమవారం అభ్యంతరాల స్వీకరణకు ఆఖరి తేదీ.

ఒకరిపై ఒకరు నెపం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 15059 మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. ఇందులో సెకెండరీ గ్రేడ్ టీచర్లు 7307 మంది, స్కూల్ అసిస్టెంట్లు 6849 మంది, భాషాపండితులు 117 మంది, ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు 340 మంది, గ్రేడ్ -2 ప్రధానోపాధ్యాయులు 386 మంది, పీఈటీలు 60 మంది ఉన్నారు. టీచర్ల కోసం విద్యాశాఖ సీనియారిటీ లిస్టు రెడీ చేసింది. ముఖ్యంగా ఉమ్మడి జిల్లాల విద్యాశాఖాధికారులు టీచర్స్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (టిస్), టీచర్ల డీఎస్సీల ఆధారంగా తమ వద్ద ఉన్న సమాచారంతో సీనియారిటీ లిస్టు రెడీ చేశారు. ఇది తాత్కాలిక జాబితా మాత్రమే. వారం రోజుల పాటు జాబితాపై టీచర్ల నుంచి అభ్యంతరాలు స్వీకరించేందుకు విద్యా శాఖ గడువు ఇచ్చింది. జాబితాను బహిర్గతం చేయడంతో అందులో లోపాలు ఉన్నాయంటూ, అనేక తప్పులు దొర్లాయంటూ టీచర్లు మండి పడుతున్నారు. అయితే తప్పులు దొర్లడంపై అటు విద్యాశాఖ, ఇటు టీచర్లు ఒకరిపై ఒకరు నెట్టేసుకుంటున్నారు. డీఎస్సీల వారీగా రోస్టర్ కమ్ మెరిట్ జాబితాలు బయట పెట్టకపోవడంతోపాటు, వాటి ఆధారం గా అధికారులు లిస్టు రెడీ చేయలేదని సంఘాల నేతలు వాపోతున్నారు. అందువల్లే ఇన్ని తప్పులు దొర్లుతున్నాయని టీచర్లు, నేతలు అంటు న్నారు. మరోవైపు టీచర్లే 'టిస్'లో అడ్డదిడ్డంగా నమోదు చేశారని, సొంత ర్యాంకులు, మేనేజ్‌మెంట్, డీఎస్సీ వివరాలు కూడా పొరపాటుగా ఎంట్రీ చేశారంటూ అధికారుల నుంచి వాదన వినిపిస్తోంది.

ఆరు రోజుల్లో 455 అభ్యంతరాలు

ఈనెల 4 నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తున్నారు. లిస్టులో అనేక పొరపాట్లు ఉన్నాయని టీచర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల టీచర్ల నుంచి అభ్యంతరాలి చ్చేందుకు గత ఆరు రోజుల్లో టీచర్లు పోటెత్తారు. ప్రధానంగా టీచర్లు పనిచేస్తున్న మేనేజ్‌మెంట్, డీఎస్సీ ర్యాంకులు, డీఎస్సీ ఇయర్ తప్పుగా నమోదు చేశారని, వాటిని మార్చాలంటూ టీచర్ల నుంచి వినతులు వస్తున్నాయి. ఇప్పటి వరకూ 455 అభ్యంతరాలు వచ్చాయి. ఇందులో స్కూల్ అసిస్టెంట్స్‌కు సంబంధించి 305 రాగా 45 పరిష్కరించారు. ఎస్‌జీటీల నుంచి 150 అభ్యంతరాలు రాగా 58 అభ్యంతరాలను పరిష్కరించారు. సోమవారం సాయంత్రం వరకూ గడువు ఉంది. ఆ సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

అభ్యంతరాలన్నింటినీ పరిష్కరిస్తాం

ప్రస్తుతం రూపొందిస్తున్న టీచర్ల సీనియారిటీ లిస్టు చాలా కీలకమైనది. ఈనెల 4 నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తున్నాం. ఇప్పటి వరకూ 455 వచ్చాయి. వాటిలో ఇప్పటికే 103 పరిష్కరించాము. సోమవారం సాయంత్రం వరకూ గడువు ఉంది. టీచర్ల నుంచి ఆధారాలతో లిఖితపూర్వకంగా వచ్చిన అభ్యంతరాలను ఒకటి, రెండు రోజుల్లో పరిష్కరిస్తాం. ఏ టీచర్‌కు అన్యాయం జరగకుండా చూస్తాం.

- ప్రసాద్‌బాబు, డీఈఓ, అనంతపురం

మహిళలు సమాజాన్ని శాసించాలి

- జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న



ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

అనంతపురం కల్చరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మహిళలు సమాజాన్ని శాసించే దిశగా రాణించాలని అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని అనంత మహిళా వేదిక ఆధ్వర్యంలో ఆదివారం కృష్ణకళామందిర్ నుంచి క్లాక్‌టవర్ మీదుగా సప్తగిరి సర్కిల్ వరకు భారీ ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో యువతులు, మహిళలు సమాజంలో మహిళ పాత్రపై ప్రదర్శనలు చేస్తూ ముందుకు సాగారు. అనంతరం లలితకళా పరిషత్‌లో డాక్టర్ ప్రసూన, న్యాయవాది గాజుల పద్మజ సంయుక్త అధ్యక్షతన మహిళా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, మహిళా సామాజిక వేత్త దేవి, మహిళా ప్రాంగణం జిల్లా మేనేజర్ వనజా అక్కమ్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తొలుత చిన్నారులు, మహిళలు శాస్త్రీయ నృత్యాలు, కోలాట ప్రదర్శనలు, నాటక ప్రదర్శనలతో అలరించారు. అనంతరం అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న మాట్లాడుతూ తాను ఓ మహిళగా ఐఏఎస్ చదివి, సమాజంలో అధికారిగా నిలవడానికి తన తల్లిదండ్రుల ప్రోత్సాహంతోపాటు పట్టుదల, ఉన్నత ఆశయంతోనే సాధ్యమైందన్నారు. మహిళా దినోత్సవం అనగానే తొలుత అందరి మదిలో మెదిలేది అమ్మేనని, మహిళ అంటే అంతటి గొప్పది అని పేర్కొన్నారు. మహిళా సామాజికవేత్త దేవి మాట్లాడుతూ 78 సంవత్సరాల స్వాతంత్ర్య భారతంలోనూ మహిళలకు సమాన హక్కులు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. వనజా అక్కమ్మ మాట్లాడుతూ ఒక కుటుంబం క్షేమం మహిళపైనే ఆధారపడి ఉంటుందని, కాబట్టి మహిళలు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం వివిధ రంగాల్లో సేవలందిస్తున్న పలువురు మహిళలకు ప్రశంసా పత్రాలు, లక్ష్మి ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో చీరలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి, చంద్రిక, కెనరా బ్యాంకు రీజనల్ మేనేజర్ యాదయ్య, లక్ష్మి ఇండస్ట్రీస్ అధినేత సందీప్ కుమార్, రెడ్స్ భానుజా, ఇన్నర్‌వీల్ క్లబ్ జయంతి, శ్రీవల్లి, స్టాఫ్ నర్స్ అసోసియేషన్ లత, ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు బృంద, జేవీవీ నాయకురాలు లక్ష్మి, శశికళ, మాధవీలత, అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న

మహిళల ఆర్థిక స్వావలంబనకు సీఎం కృషి

టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్



అనంతపురం, మార్చి9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళలకు అత్యధిక గౌరవమిచ్చే పార్టీ తెలుగుదేశం అన్నారు. కూటమి ప్రభుత్వం మహిళల కోసం అనేక పథకాలను రూపొందించిందన్నారు. మహిళా సంక్షేమం, సాధికారత, భద్రత కోసం వివిధ సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకొని అనేక పథకాలను ప్రారంభించిందన్నారు. లక్షమంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తయారుచేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. రాష్ట్రంలోని మహిళలు, పిల్లల భద్రత కోసం శక్తి బృందాలను సీఎం ప్రారంభించారన్నారు. చేనేత రంగాన్ని పరుగులు పెట్టించేందుకు చేనేత రథాలను ప్రారంభించారన్నారు. ఇందుకుగానూ ప్రతి జిల్లాకు రూ.60 లక్షలు కేటాయించారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.5 లక్షల మంది మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. రాష్ట్రంలో 7471 పట్టణ పేద మహిళలకు రూ. 645.52 కోట్లు బ్యాంకు రుణాలు పంపిణీ చేశారన్నారు. డ్వాక్రా ఉత్పత్తుల విక్రయానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఫ్లిప్ కార్ట్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుందన్నారు. వ్యవసాయ, వ్యవసాయేతర ఉత్పత్తులపై మహిళలకు వ్యాపార శిక్షణ అందించేందుకు డ్వాక్రా క్యాటలిస్ట్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్‌తో ఒప్పందంపై సంతకం చేయనుంద న్నారు. ఎంతోకాలంగా ఆశా వర్కర్లు డిమాండ్ చేస్తున్న గ్రాట్యుటీని సీఎం చంద్రబాబునాయుడు అమలు చేశారన్నారు. ఉద్యోగ విరమణ పొందిన, మరణించిన ఆశా వర్కర్లకు జూన్ 2024 నుంచి గ్రాట్యుటీ అమలు చేయబడుతుందన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధే చంద్రబాబు లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

వదాన్య టీంని ఆదర్శంగా తీసుకోవాలి

సినీ దర్శకుడు బీవీఎస్ రవి

ఘనంగా వదాన్య జన సొసైటీ బహుమతుల ప్రదానోత్సవం



విద్యార్థులకు చెక్కును అందజేస్తున్న అతిథులు, వదాన్య జన సొసైటీ సభ్యులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): నేటి యువత వదాన్య జన సొసైటీ సభ్యులను ఆదర్శంగా తీసుకోవాలని సినీ దర్శకుడు బీవీఎస్ రవి అన్నారు. వదాన్య జన సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్‌జీటీ మెగా గ్రాండ్ టెస్ట్, టాలెంట్ టెస్ట్‌లలో ప్రతిభ చూపిన పలువురు విద్యార్థులకు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్డీటీ ఇంక్లూజివ్ సెంటర్‌లో ఆదివారం వదాన్య జనసొసైటీ వ్యవస్థాపకులు అశోక్ పడపాటి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి బీవీఎస్ రవి, ఆర్డీటీ మాంచో ఫెర్రర్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ 2024లో శ్రీసత్యసాయి జిల్లాలోని జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో వదాన్య సొసైటీ టాలెంట్ టెస్ట్ నిర్వహించి, ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేయడం అభినందనీయమన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన వి.మంజుల, విశ్వనాథ్, చెన్నారెడ్డి, నరసింహ, లోకేశ్, ఓబులేసుకు రూ.4 లక్షల విలువచేసే బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీటీ ఎకాలజీ సెంటర్ మల్లారెడ్డి, న్యాయవాది పుట్టపర్తి ప్రభాకర్‌రెడ్డి, రవికాంత్ రమణ, లెనిన్‌బాబు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో ఐదుగురికి గాయాలు

ధర్మవరం, మార్చి9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం కుక్కల దాడిలో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. దారి వెంట వెళ్తున్న వారిపై కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. లోనికోటకు చెందిన ఇమామ్‌హుస్సేన్, శారదానగర్‌కు చెందిన రెడ్డమ్మ, గాంధీనగర్ వాసి ప్రభాస్, గొట్లూరుకు చెందిన జీవన్‌కుమార్ అనే బాలుడితోపాటు మరొకరిపై కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. వారికి స్థానిక ప్రభుత్వాస్పత్రిలో వైద్య చికిత్సలు అందించారు. పట్టణ వీధుల్లో స్వైరవిహారం చేస్తున్న కుక్కలను నియంత్రించడానికి మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఏమైందో..?

గుర్తు తెలియని శవం ఆచూకీ లభ్యం

జేబులోనే డబ్బులు

పోస్టుమార్టంతో ఆధారాలు దొరికేనా...?

అనంతపురం క్రైం,మార్చి9(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని మృతదేహం ఆచూకీ దొరికింది. కుటుంబసభ్యులు గుర్తించారు. శనివారం రాత్రి నగరంలోని పాతూరులో బ్రహ్మంగారి గుడి సమీపంలో గుర్తుతెలియని మృతదేహాన్ని వన్‌టౌన్ పోలీసులు గుర్తించిన విషయం తెలిసిందే. నార్పల మండలం గడ్డంనాగేపల్లికి చెందిన జూటూరు ఓబులేసు(55)గా గుర్తించారు. గ్రామం నుంచి శనివారం మధ్యాహ్నం బయలుదేరిన ఓబులేసు అనంతపురం వచ్చాడు. బైక్ రిపేరీ ఉందని ఇంటి నుంచి వచ్చే సమయంలో రూ.20వేలు నగదు తీసుకొచ్చినట్లు తెలిసింది. ఏమైందో తెలియదు కానీ, రాత్రి 8గంటల సమయంలో వన్‌టౌన్ పోలీసులు రోడ్డుపక్కన బనియన్, డ్రాయర్‌తో ఉన్న మృతదేహాన్ని గుర్తించారు. కుటుంబ సభ్యులు మృతదేహాన్ని గుర్తించాక పోలీసులు పలు కోణాల్లో ఆరా తీశారు. రాత్రి 11గంటల సమయంలో చివరి సారి ఫోన్ రింగ్ అయిందనీ, లిఫ్ట్ చేయలేదని కుటుంబసభ్యులు.. పోలీసులకు తెలిపారు. ఈ క్రమంలో ఫోన్ నంబర్ ద్వారా లొకేషన్ గుర్తించగా.. గుత్తి రోడ్డులోని కేటీఆర్ ఫంక్షన్‌హాల్ వెనుక వైపు ఉన్నట్లు తెలిసింది. ఓబులేసును ఆటోలో దింపి వెళ్లారని భావిస్తున్నారు. ఓబులేసు వెంట తెచ్చుకున్న డబ్బు అతని డ్రాయర్‌లోనే ఉండటం గమనార్హం. చొక్కా, పంచె ఎక్కడికెళ్లాయనేది అంతుబట్టడం లేదు. మద్యం మత్తులో ఉన్న ఓబులేసును వదిలి వెళ్లారా..? ఇంకా ఏమైనా జరిగిందా..? అనే కోణంలో పోలీసులు ఆరాతీస్తున్నారు. సోమవారం పోస్టుమార్టం నిర్వహిస్తే విషయం తెలుస్తుందని సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ తెలిపారు. మృతుడి భార్య శారద ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టమోటా కిలో రూ. 8

అనంతపురం రూరల్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 8తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు ఆదివారం 225 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 7, కనిష్ఠ ధర రూ. 5 పలికినట్లు ఆయన తెలిపారు.

62 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో తగ్గుతోంది. ఉమ్మడి జిల్లాకు హంద్రీనీవా పథకం కింద అందాల్సిన సాగు తాగునీరు పూర్తిస్థాయిలో నీటి విడుదల కావడంతో బంద్ చేశారు. రాగులపాడు ఎత్తిపోతల పథకంలో నిల్వ వున్న నీటిని మాత్రమే వదులుతున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. ఇందులోభాగంగా ఆదివారం రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో 62 క్యూసెక్కులు ఉన్నట్లు చెప్పారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ఫేజ్-2కు 45 క్యూసెక్కులు వెళుతున్నాయన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.499 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు వెల్లడించారు.

విద్యార్థి అదృశ్యం



గౌతమ్

అనంతపురం క్రైం, మార్చి9(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఓ విద్యార్థి అదృశ్యమయ్యాడు. మూడో రోడ్డులో నివాసముంటున్న 14ఏళ్ల మణి గౌతమ్ ఒకటో రోడ్డులోని ఓ ప్రైవేటు స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. చదువుపై ఆసక్తి లేదు. స్కూల్‌కు సరిగా వెళ్లేవాడు కాదు. ఈ క్రమంలో హ్యాండ్‌రైటింగ్ కోర్సుకని అబ్బాయి తల్లి పంపేది. ఈనెల 6వ తేదీ ఆ ఫీజుకని రూ.1000 ఇచ్చి పంపింది. ఆ డబ్బుతో ఇంటి నుంచి బయటకు వచ్చిన గౌతమ్ అదృశ్యమయ్యాడు. బంధువుల ఇళ్లలో ఆరా తీసినా ఆచూకీ దొరకలేదు. దీంతో కుటుంబసభ్యులు.. త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

న్యూస్ బాక్స్

నేడు పాండురంగడి నిజపాద స్పర్శదర్శనం

అనంతపురం కల్చరల్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ఫాల్గుణ శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని సోమవారం రామ్‌నగర్‌లోని రుక్మిణి పాండురంగస్వామి దేవాలయంలో స్వామి నిజపాద స్పర్శదర్శనం కార్యక్రమం నిర్వహించనున్నట్లు భవసార్ క్షత్రియ సమాజ్ అధ్యక్ష కార్యదర్శులు తిరుపతిరావు, ఆనంద్ ఆదివారం సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఏకాదశి సందర్భంగా భక్తుల చేతులమీదుగా స్వామివారి పాదస్పర్శ చేయిస్తామన్నారు. భక్తులు విరివిగా తరలిరావాలని ఆయన కోరారు.

పశువుల సంత ఆదాయం రూ.4.43 లక్షలు

అనంతపురం రూరల్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌కు పశులసంతతో రూ.4.43 లక్షల ఆదాయం వచ్చిందని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు ఆదివారం తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా రూ.2.60 లక్షలు, ఆదివారం జరిగిన ఎనుములు, ఎద్దులు, ఆవుల సంతతో రూ.1.82 లక్షలు వచ్చిందని తెలిపారు.

బాధిత రైతులను ఆదుకోవాలి: సీపీఎం

గార్లదిన్నె, మార్చి 9(ఆంధ్రజ్యోతి): అగ్నికి ఆహుతైన పండ్ల తోటల రైతులను ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి చెన్నారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని పెనకచెర్ల, మర్తాడు, కల్లూరు గ్రామాల్లో శనివారం చీనీ, మామిడి, దానిమ్మ తోటలు అగ్నికి ఆహుతైన విషయం తెలిసిందే. దీనిపై చెన్నారెడ్డి ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. కొన్నేళ్లుగా రైతులు పట్టువదలకుండా వ్యవసాయ చేస్తూ ఏదో విధంగా ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వాలు వ్యవసా యంలో నష్టపోయిన రైతులను ఆదుకునే పథకం పెట్టాలన్నారు. ముఖ్యంగా పండ్లతోటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

అలరించిన నాటక ప్రదర్శన



నాటకంలోని ఓ సన్నివేశం

అనంతపురం కల్చరల్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): లలితకళా పరిషత్, టీజీవీ కళాక్షేత్రం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం లలితకళా పరిషత్‌లో నిర్వహించిన 'జగదేక సుందరి సామా' పద్యనాటక ప్రదర్శన వీక్షకులను ఎంతగానో అలరించింది. కార్యక్రమానికి పరిషత్ ప్రధాన కార్యదర్శి పద్మజ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ప్రదర్శనానంతరం కళాకారులను, నాటక దర్శకుడు పత్తి ఓబులయ్యను పరిషత్ కార్యవర్గం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పరిషత్ సభ్యులు రామగోవింద్‌సాగర్, సంగాల నారాయణస్వామి, సురభి ఆనంద్, అస్లాం బాషా తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో నృత్య ప్రదర్శన



నృత్యం చేస్తున్న కళాకారులు

అనంతపురం రూరల్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని శిల్పారామంలో ఆదివారం భరతనాట్య నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. శిల్పారామం ఆధ్వర్యంలో నగరానికి చెందిన తాత్విక సాయి బృందంచే పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆదిదేవుడు, ఇదిగో భద్రాది, బాలా త్రిపుర సుందరి, గుమ్మనీ శృతి, తిల్లన, విశాల లోచని వంటి గేయాలకు కళా కారులు ప్రదర్శనలు ఇచ్చారు. కార్యక్రమంలో కళాకారులు తాత్విక సాయి, అక్షయ, మేఘన, కేతన, వర్షిణి, శిల్పారామం ఏఓ క్రిష్ణప్రసాద్ పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

గార్లదిన్నె, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కల్లూరు జిల్లా పరిషత్ పాఠశాలలో ఆదివారం అనంతపురం నగరానికి చెందిన ధన్వంతరి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అన్యూహ స్పందన వచ్చినట్లు వైద్యులు నెట్టం వెంకట శివకుమార్ చౌదరి తెలిపారు. సుమారు 250 మంది రోగులు హాజరయ్యారు. వారికి బీపీ, షుగర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. వైద్యులు వరప్రసాద్‌రెడ్డి, దివ్యతేజారెడ్డి, సంధ్య సిబ్బంది పాల్గొన్నారు.

జపాన్ వర్సిటీతో మిట్స్ ఒప్పందం

అనంతపురం సెంట్రల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): జపాన్ ఐజు విశ్వవిద్యాలయంతో జేఎన్టీయూ అనుబంధ మిట్స్ కళాశాల అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఆవిష్కరణలు, ఉమ్మడి పరిశోధన ప్రాజెక్టులు, కల్చరల్ లర్నింగ్, అధ్యాపకుల మార్పిడి, ప్రపంచ మార్పునకు అనుగుణంగా పాఠ్యాంశాల రూపకల్పన తదిర అంశాలను సంయుక్తంగా నిర్వహించేందుకు ఒప్పదం దోహదపడుతుందని తెలిపారు. ఐజు బోర్డ్ ఆఫ్ ఎగ్జిక్యూటివ్ ఛైర్‌పర్సన్ సుకహర సునియో, డైరెక్టర్ టాట్సుకి కవాగుచిలతో ఒప్పంద ప్రత్రాలను మార్చుకున్నట్లు తెలిపారు.

ఆరని జ్వాల



కాలి బూడిదైన కళాశాల ఆవరణం

అనంతపురం సెంట్రల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): నగరంలో ని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో మంటలు రగులుతూనే ఉన్నాయి. దాదాపు వారం రోజులుగా మెల్లమెల్లగా మైదానం మొత్తం విస్తరిస్తోంది. అకతాయిలు వేసిన నిప్పురవ్వకు చెట్లు బూడిద అవుతున్నాయి. దీనికి నివారించేందుకు తగిన సిబ్బంది లేకపోడం, మైదాన నిర్వహణకు తగిన నిధులు వినియోగానికి అనుమతి లేకపోవడం తదితర కారణాల రీత్యా వర్షాకాలం ఏపుగా గడ్డి పొదళ్లు పెరగడం. వేసవిలో అగ్గిరవ్వలకు అహుతి కావడం షరామామూలుగా మారింది. కొన్ని సంవత్సరాలుగా ఇదే వరుస కొనసాగుతోందని విద్యార్థులు గుర్తుచేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో కళాశాల హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులు ఎప్పుడు ఏమవుతోందనని భయాందోళనకు గురువుతున్నారు. కాగా నీరు-చెట్టు కింద మొక్కలు నాటి, ఎక్కడిక్కడ వర్షపు నీరు ఇంకేలా గుంతలు తీశారు. దీంతో వర్షపు నీటికి మొక్కలు వృక్షాలైనా వాటిని సంరంక్షించుకోలేని పరిస్థితి నెలొకందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.



కమలానగర్‌లో నిర్మానుష్యంగా వీధి



జనసంచారం లేని రాజు రోడ్డు

బోసిపోయిన నగర వీధులు

- నిర్మానుష్యంగా ప్రధాన రహదారులు
- చాంపియన్స్ ట్రీఫీ ఫైనల్ ప్రభావం
- ఆదివారం, ఎండ తీవ్రత కూడా..



టవర్‌క్లాక్ ఫ్లైఓవర్‌పై పరిస్థితి ఇలా...

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఓ వైపు చాంపియన్‌షిప్ క్రికెట్ ఫైనల్స్...మరోవైపు ఆదివారం సెలవు, ఎండ తీవ్రతతో నగరంలోని ప్రధాన రహదారులు, వీధులు నిర్మానుష్యంగా కనిపించాయి. నగరంలోని టవర్‌క్లాక్, సుభాష్‌రోడ్డు, రాజురోడ్డు, కమలానగర్, శ్రీకంఠం సర్కిల్, హౌసింగ్‌బోర్డు, సాయినగర్, అశోక్‌నగర్, శారదానగర్, కలెక్టరేట్ రోడ్డు, కోర్టురోడ్డు, రామ్‌నగర్ ఫ్లై ఓవర్, టవర్‌క్లాక్ ఫ్లైఓవర్‌తో పాటు జాతీయ రహదారులలో వాహనాల రాకపోకలు, జనసంచారం కనిపించలేదు. చాంపియన్‌షిప్ ట్రోఫీలో భాగంగా ఆదివారం ఇండియా-న్యూజిలాండ్ ఫైనల్ మ్యాచ్ ఉండడంతో మధ్యాహ్నం నుంచి ప్రజలు ఇళ్లలో టీవీలకు అతుక్కుపోయారు. దీంతో రహదారులన్నీ నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. ప్రజలు ఫైనల్ మ్యాచ్‌ను తిలకించడానికి ఆసక్తి చూపారు. మరోవైపు ఆదివారం సెలవు రోజు కావడం, ఎండ తీవ్రత 37 డిగ్రీలుగా నమోదైంది. దీంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు.



జాతీయ రహదారిపై కనిపించని వాహనాలు



బళ్లారి బైపాస్ రోడ్డులో ఇలా...



టవర్‌క్లాక్ వైపు వెళ్లే రహదారిపై అరకొరగా తిరుగుతున్న వాహనాలు

యువత పోరుతో హెచ్చరిక పంపుదాం

- వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి



మాట్లాడుతున్న అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం క్రైం, మార్చి9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, నిరుద్యోగుల పక్షాన నిలుస్తూ వైసీపీ ఆధ్వర్యంలో చేపట్టనున్న యువత పోరును విజయవంతం చేసి కూటమి ప్రభుత్వానికి హెచ్చరిక పంపుదామని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంతవెంకటరామిరెడ్డి పిలుపు నిచ్చారు. ఆదివారం వైసీపీ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ ఆధ్వర్యంలో యువత పోరు సన్నాహక సమావేశం నిర్వహించారు. అనంతవెంకటరామిరెడ్డి హాజరై మాట్లాడారు. ఈనెల 12న నిర్వహించే యువత పోరు కార్యక్రమం ప్రభుత్వానికి హెచ్చరికగా ఉండాలన్నారు. చంద్రబాబు నాయకత్వంలో కూటమి అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలవుతున్నా ఒక్క హామీని కూడా పూర్తిగా నెరవేర్చలేదన్నారు. ఈనెల 12వతేదీ ఉదయం 10గంటలకు నగరంలోని జడ్పీ కార్యాలయం నుంచి యువత పోరు ర్యాలీ ప్రారంభమై కలెక్టరేట్ వరకు కొనసాగుతుందన్నారు. యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ మాట్లాడుతూ... ఎన్నికల్లో అనేక హామీలిచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక అటకెక్కిస్తున్నారని అన్నారు.

'కార్యకర్తలకు అండగా ఉంటాం'

రాప్తాడు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): టీడీపీ పార్టీ కోసం పని చేసే కార్యకర్తలకు పరిటాల కుటుంబ ఎల్లవేళలా అండగా ఉంటుందని ఆ పార్టీ మండల ఇన్‌చార్జ్ ధర్మవరపు మురళి తెలిపారు. ఆయన ఆదివారం మండలంలోని బండమీదపల్లిలో పర్యటించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన టీడీపీ కార్యకర్త మాధవరాజు ఇంటి వద్దకు వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాధవరాజు టీడీపీ సభ్యత్వం ఉన్నందువలన పార్టీ కార్యలయం నుంచి రూ. 5 లక్షలు ఆర్థిక సాయం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. కుటుంబ సభ్యులకు రూ. 20 వేలు ఆర్థిక సాయం అందజేశారు. అలాగే మరో రెండు కుటుండాలను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. గ్రామంలో రూ. 8 లక్షలతో నూతన సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, నెట్టెం లక్ష్మినారాయణ, శ్యాంకుమార్, వెంకట్రాముడు, రాజేంద్ర, పక్కీర్‌రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు నారాయణస్వామి, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదల ఆర్థిక అవసరాలు తీర్చడమే లక్ష్యం

- మహాజన సభలో చైర్మన్ జేఎల్ మురళీధర్



సభలో మాట్లాడుతున్న జేఎల్ మురళీధర్

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పేదల ఆర్థిక అవసరాలను తీర్చడంలో, మహిళా ఆర్థిక పురోగాభివృద్ధిలో అండగా నిలవడమే తమ లక్ష్యమని అర్బన్ బ్యాంకు చైర్మన్ జేఎల్ మురళీధర్ పేర్కొన్నారు. స్థానిక సుభాష్‌రోడ్డులో ఉన్న శ్రీకృష్ణదేవరాయభవన్‌లో ఆదివారం అనంతపురం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు 109వ మహాజనసభ నిర్వహించారు. ఈ సందర్భంగా జేఎల్ మురళీధర్ మాట్లాడుతూ... పాలకవర్గసభ్యులు, సిబ్బంది సమిష్టి కృషి, శ్రమతో బ్యాంకు ఆర్థిక అభివృద్ధి సాధించిందన్నారు. ప్రజల్లో ఆర్థిక భరోసా కల్పించేందుకు డిపాజిట్లపై ఏ ఇతర బ్యాంకులు ఇవ్వని అత్యధిక వడ్డీ తమ బ్యాంకు అందస్తోందని తెలిపారు. పలు రుణాల సదుపాయం అందుబాటులోకి తెచ్చామన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహా లక్ష్మీ పథకం ద్వారా మహిళల కోసం 25శాతం చెల్లిస్తే నచ్చిన దుకాణంలో బంగారు ఆభరణాలు కొనుగోలు కు రుణాలు చెల్లిస్తున్నామన్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ తమ బ్యాంకు ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు. అనంతరం బ్యాంకు సీఈఓ విజయభాస్కర్ 2024-25 వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు వైస్ చైర్మన్లు వెంకటాద్రి, గోల్డ్‌బాషా, డైరెక్టర్లు సుంకర రమేష్, కృష్ణకుమార్, రామాంజినేయులు, మాగిశెట్టి చంద్రశేఖర్, రొళ్ల భాస్కర్, చింతా భాస్కర్, సుబ్రమణ్యం, రమణయ్య, విశ్రాంత డీసీఓ పుల్లప్ప, మేనేజర్లు, డిపాజిటర్లు, ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న ముగ్గురి అరెస్ట్

నార్పల, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గడ్డం నాగేపల్లి పరిధిలో పేకాడుతున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రత్యేక విభాగం పోలీసులు, నార్పల పోలీసులు సంయు క్తంగా ఆదివారం మండలంలో దాడులు నిర్వహించారు. గ డ్డం నాగేపల్లిలో ముగ్గురిని అరెస్ట్ చేశారు. తాడిపత్రికి చెందిన ఒకరు, గడ్డంనాగేపల్లికి చెందిన ఇద్దరు ఉన్నారు. వారి నుంచి రూ.38వేల నగదు, బైక్ స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ఘనంగా ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

- పాల్గొన్న ఎమ్మెల్యే పరిటాల సునీత



ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న ఎమ్మెల్యే

రామగిరి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఆంజేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే పరిటాల సునీత, పలువురు టీడీపీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు. విగ్రహ ప్రతిష్ఠ అనంతరం ఉదయం 7గంటలకు పలు హోమాలు నిర్వహించారు. ఈ హోమాలలో ఎమ్మెల్యే పరిటాల సునీత, టీడీపీ సీనియర్ నాయకుడు ఎల్ నారాయణచౌదరి తదితరులు పాల్గొన్నారు. అలాగే ప్రత్యేక పూజలు చేయించారు. దేవాలయ నిర్మాణానికి ఎమ్మెల్యేతో పాటు పరిటాల ట్రస్టు, టీడీపీ సీనియర్ నాయకుడు ఎల్ నారాయణ చౌదరి తదితరుల సహాయ సహకారాలు ఉన్నాయని గ్రామస్థులు తెలిపారు. గ్రామస్థుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేపట్టారు. స్వామి వారి దర్శనానికి సమీప గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు రామ్మూర్తి నాయుడు, మండల కన్వీనర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

రామగిరి మండలపరిధిలోని వెంకటాపురంలో ఉన్న క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే పరిటాల సునీత రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాలకు సంబంధించిన 16 మందికి రూ.14.96 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీచేశారు. బాధితుల సహాయార్థం ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు.



బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం అనంతపురం జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి కదిరి లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. - కదిరి (ఆంధ్రజ్యోతి)

పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం



మహిళా సీనియర్ సిటిజన్‌ను సన్మానిస్తున్న పెన్షనర్లు

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. నగరం లోని పెన్షనర్స్ భవన్‌లో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దనగౌడ్ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. పలువురు మహిళలను పెన్షనర్లు ఘనంగా సన్మానించారు. కేఎస్‌ఆర్ డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రి న్సిపాల్ నిర్మల, సీనియర్ సిటిజన్ ఏజీ ప్రమీలమ్మ, సామాజిక సేవకురాళ్లు దేవి, లహరి, అయేషా, సావిత్రిదేవి, ఆదిలక్ష్మి, పెన్షనర్లు శీలా జయరామప్ప, ప్రభాకర్, అనంతయ్య, రమణ, గోవింద రాజులు, డేనియల్ ప్రభాకర్, చంద్రశేఖర్ రెడ్డి, వరదరాజులు, జయరాం, నారా యణస్వామి, సూర్యనారాయణ, మోహన్‌రావు, నాగరాజు పాల్గొన్నారు.

ఉచిత కోచింగ్ సెంటర్లు పెంచాలి : ఎంఎస్ఎఫ్

అనంతపురం విద్య, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ఎస్సీఎస్టీ విద్యార్థుల సౌకర్యార్థం నిర్వహించే ఉచిత డీఎస్సీ కోచింగ్ సెంటర్ల సంఖ్య పెంచాలని ఎంఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంత్రి సుదర్శన్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో టెట్ అర్హత సాధించిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉచిత డీఎస్సీ కోచింగ్ ఇవ్వడం అభినం దనీయం అన్నారు. అనంతపురం జిల్లాలో ఎస్సీఎస్టీ విద్యార్థులు అధికంగా ఉన్నారని అన్నారు. కావున ఒకటి, రెండు సెంటర్లకు అనుమతి ఇవ్వడం కాకుండా... మంచి వసతులు ఉన్న, నైపుణ్యంతో శిక్షణ ఇచ్చే ఉచిత డీఎస్సీ కోచింగ్ సెంటర్లను పెంచాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

వసతుల్లేక..

- శింగనమలలో ఆటస్థలం ఉన్నా... నిరుపయోగం
- మంచి క్రీడాకారులు ఉన్నా... సదుపాయాలు శూన్యం



అపరిశుభ్రంగా ఉన్న క్రీడామైదానం

శింగనమల, మార్చి 9(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ పాఠశాలకు సంబంధించి ఐదెకరాల ఆటలస్థలం ఉంది. అడేందుకు సరైన వసతులు లేవు. ఐగా అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. మండలంలో రాష్ట్ర స్థాయిలో ఆటల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు, యవకులు ఎంతోమంది ఉన్నారు. ఉన్న ఆటస్థలంలోనే సాధన చేసి వారు మంచి ప్రతిభ చూపారు. వారిని ఇంకా తీర్చిదిద్దేందుకు వసతులు కరువయ్యాయి. శింగనమలలో ప్రభుత్వ జూనియర్ కళాశాల పక్కనే ఐదెకరాలకుపైగా ఆటస్థలం ఉంది. ఈ స్థలం రాళ్లు, కంపచెట్లు, పిచ్చి మొక్కలతో ఉండేది. దాదాపు ఎనిమిదేళ్ల కిందట అప్పటి ఎస్ఐ హమీద్‌ఖాన్ ఆ స్థలాన్ని క్రీడా మైదానంగా తీర్చిది ద్దారు. ప్రభుత్వ నిధులతో ప్రహరీ నిర్మించడంతో కొన్నేళ్ల పాటు యవకులు, విద్యార్థులకు వివిధ ఆటల సాధనకు ఉపయోగ పడింది. కాలక్రమేణ దాని గురించి ప్రట్టించుకోకపోవడం, ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఆటస్థలం మరమ్మతుల కోసం నయాపైన రాకపోవ డంతో ఆ స్థలం మళ్లీ పూర్వపు స్థితికి చేరింది. ప్రహరీని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంతో యవకులు, గ్రామస్థులు రాత్రిళ్లు ఆ స్థలంలో మద్యం తాగి గొడవలు పడుతున్నారు. ఇప్పటికైనా దీనిపైన స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతులకు నిధుల కొరత

ఆటస్థలం ప్రహరీ మరమ్మతులకు 15వ ఆర్థిక ప్రణాళిక నిధుల కింద శింగనమల పంచాయతీకి ఈ సంవత్సరం రూ.లక్ష మంజూరు అయినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే క్రీడా శాఖ నుంచి కానీ, జూనియర్ కళాశాల నుంచి గానీ ఎలాంటి నిధులు మం జూరు కాకపోవడంతో ఆటస్థలం పరిస్థితి ఎక్కడ వెసిన గోంగళి అక్కడే అన్నట్లు తయారులైంది...

ప్రజాప్రతినిధులు చొరవ చూపేరా..?

మండలంలోని క్రీడాకారులు, విద్యార్థులు, యవకులు క్రీడలో రాష్ట్ర , జాతీయ స్థాయిలో ప్రతిభ చూపాలంటే మెరుగైన ఆటస్థలం ఉండాలి. శింగనమలలోని ఆటస్థలాన్ని అలా తీర్చిదిద్దితే క్రీడాకారులు మెరుగైన శిక్షణ పొంది ప్రతిభ చూపే ఆవకాశాలు ఉన్నాయి. ఇప్పటికైనా ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఇక్కడ మంచి స్టేడియం నిర్మాణానికి కృషి చేయాలని, అలాగే స్వంచ్ఛంద సంస్థలు చొరవ చూపాలని మండల ప్రజలు, గ్రామస్థులు కోరుతున్నారు..

ఉన్న ఆటస్థలంలోనే శిక్షణ



నేను శింగనమల పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నా. మా కున్న ఆటస్థలంలోనే అర్చరీ శిక్షణ తీసుకుని మూడుసార్లు రాష్ట్ర స్థాయిలో బహుమతులు సాధించా. జాతీయ స్థాయిలో ప్రతిభ చూపాలంటే మెరుగైన ఆటస్థలం ఉండాలి. మా గ్రామంలో విశాల మైన ఆటస్థలం ఉంది. తగిన వసతులు లేవు. మరమ్మతులు చేసి వసతులు కల్పించాలి. - కొప్పెల గోవర్ధన్‌రెడ్డి, విద్యార్థి

మంచి శిక్షణతో ఏదైనా సాధిస్తాం



నేను శింగనమంల పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నా. మా పీడీ సహకారంతో ఆర్చరీలో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపా. అయితే మాకు శిక్షణ ఇవ్వడానికి సరియైన ఆటస్థలం లేదు. అయినా ఉన్న దానిలోనే పట్టుదలతో కష్టపడి ప్రతిభ చూపుతున్నాం. మాకు మంచి ఆటస్థలం ఏర్పాటు చేసి ఉత్తమ శిక్షణ ఇస్తే, దేశం తరఫున ఆడి పేరు తెస్తాం. - దీపిక, విద్యార్థిని

వసతులుంటే జాతీయ స్థాయిలో రాణిస్తాం



నేనే శింగనమల పాఠశాలలో పదో తరగతి చదువుతున్నా. మాది బోడిగానిదొడ్డి గ్రామం. డిస్క్‌త్రోలో రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చూపా. ఉన్న ఆటస్థలం లోనూ శిక్షణ తీసుకుని రాష్ట్ర స్థాయికి వెళ్లాం. ఆటస్థలంలో ఇంకా మంచి వసతులు వస్తే జాతీయ స్థాయిలో ప్రతిభ చూపే అవకాశం ఉంటుంది. -బోయ కార్తీక్, విద్యార్థి

ఉల్లాసంగా...ఉత్సాహంగా..

- మహిళా దినోత్సవం సందర్భంగా హ్యాపీ స్ట్రీట్



హ్యాపీస్ట్రీట్‌లో అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, మాంఛోఫెర్రర్, విశాలాఫెర్రర్, కమిషనర్ బాలస్వామి

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): అటు ఆటలు...ఇటు పాటలతో ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్డీటీ-అనంత స్పోర్ట్స్ అకాడమీ, నగరపాలక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక సప్తగిరి సర్కిల్‌లో హ్యాపీస్ట్రీట్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్డీటీ- ఏఎస్ఏలకు చెందిన యువ మహిళా నేతల ఆధ్వర్యంలో కార్యక్రమం కొనసాగింది. క్రీడలు, వినోదంతో కూడిన ఆటలు పిల్లల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. స్థానిక మహిళా కళాకారుల ప్రతిభను వెలుగులోకి తీసుకువచ్చేందుకు వినోదాత్మక కళా సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. సందేశాత్మక కళాఖండాల ప్రత్యక్ష ప్రదర్శన ఆకట్టుకుంది. క్రీడలు, కళలు, సాంస్కృతిక ప్రదర్శనలతో సమాజానికి మహిళా దినోత్సవాన్ని సంబరంగా జరుపుకునే వేదికను అందించడమే కాకుండా, అమ్మాయిలకు క్రీడల్లో సమాన అవకాశాలు ప్రోత్సాహించే లక్ష్యాన్ని కలిగించారు. గ్రీన్ ఆర్మీ ఆధ్వర్యంలో ప్రజలకు ఉచితంగా క్లాత్‌బ్యాగ్‌లు, పిచ్చుక గూళ్లు అందజేశారు. అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్, మహిళా సాధికారత డైరెక్టర్ విశాలాఫెర్రర్, నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి ప్రదర్శనలను తిలకించా రు. కార్యక్రమంలో విదేశీ మహిళలు, ఆర్డీటీ, ఏఎస్ఏ, నగర పాలక సంస్థ అధికారులు, ఉద్యోగులు, కళాకారులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



సోపాన పటం ఆడుతున్న చిన్నారులు



హ్యాపీస్ట్రీట్‌కు హాజరైన నగరవాసులు

సంక్షిప్త వార్తలు

ఘనంగా తిరుమంజన స్నపనం


తిరుమంజన స్నపనం నిర్వహిస్తున్న అర్చకులు

గుంతకల్లు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పునర్వసు నక్షత్ర సంక్రమణాన్ని పురస్కరించుకుని కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం అర్చకులు, వేదపండితులు తిరుమంజన స్నపనంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యాగశాలలో సీతారామ లక్ష్మణ సహిత ఆంజనేయ స్వామి ఉత్సవ విగ్రహాలకు పంచామృతాభిషేకం చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం తిరుమంజన స్నపన కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ వేద పండితుడు రామకృష్ణావధాని, అర్చకులు, వేద పాఠశాల విద్యార్థులు, భక్తులు పాల్గొన్నారు.

పాల్తూరులో తాగునీటికి బోరు

విడపనకల్లు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాల్తూరు గ్రామంలో తాగు నీటి కోసం సర్పంచ్ బ్యావులారాణి ఆదివారం బోరు వేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, టీడీపీ నేత పయ్యావుల శ్రీనివాసులు ఆదేశాలు మేరకు గ్రామంలోని వడ్డే కాలనీలో తాగి నీటి కోసం బోరు వేయించినట్లు తెలిపారు. బోరులో నీళ్లుబాగా పడ్డాయని, ఇక నుంచి కాలనీవాసులకు తాగునీటి కష్టాలు ఉండవని చెప్పారు. టీడీపీ మండల కన్వీనర్ బీడీ చిన్న మారయ్య, నాయకులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభించిన సీఐ యుగంధర్

పామిడి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు, టీం తారక్ ట్రస్టు సభ్యులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సీఐ యుగంధర్ ఆదివారం ముఖ్యఅతిథిగా వచ్చి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని కొనియాడారు. అనంతరం టీం తారక్ సభ్యులు సీఐను సత్కరించారు. విభిన్న ప్రతిభవంతుల జిల్లా అధ్యక్షుడు అప్పన్నగారి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ పంపిణీ చేయాలి

గుంతకల్లుటౌన్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని నెలగొండ గ్రామంలో ఏప్రిల్1వ తేదీ నుంచి ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికీ రేషన్ పంపిణీ చేయాలని ధర్మహ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్రప్రధాన కార్యదర్శి ఎం వీరాంజనేయులు ఆదివారం ప్రకటనలో కోరారు. రేషన్ దుకాణం వద్ద బియ్యం పంపిణీ చేస్తుండడంతో ప్రజలు గంటలకొద్దీ క్యూలో నిలబడలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయాన్ని ఇదివరకే కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. జిల్లా పౌరసరఫరా అధికారులు గ్రామంలో పర్యటించి ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ సరఫరా చేయాలని సిబ్బందిని ఆదేశించారని, అయినా ఆదేశాలను లెక్కచేయకుండా స్టోర్ వద్దనే రేషన్ వేస్తున్నారని అన్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో మోడల్ టెస్ట్

గుంతకల్లుటౌన్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీ సాయి మహిళా డిగ్రీ కళాశాలలో ఆదివారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో మోడల్ టెస్ట్‌ను నిర్వహించారు. ఇందుకు సంబంధించిన ప్రశ్నపత్రాలను తహసీల్దార్ రమాదేవి చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మోడల్ టెస్ట్‌ను ఆర్‌ఆర్‌బీ, కానిస్టేబుల్ మొయిన్స్ పరీక్షల అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కళాశాల కరెస్పాండెంట్ ప్రభాకర్, డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి సురేంద్రబాబు, శ్రీధర్, సీసీఈ సిబ్బంది పాల్గొన్నారు.

వాల్మీకుల సమావేశం

రాయదుర్గంరూరల్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోటలో గల మారెమ్మ ఆలయం వద్దనున్న వాల్మీకి కల్యాణమండపంలో ఆదివారం వాల్మీకుల సమావేశం జరిగింది. ఇందులో వాల్మీకి కులస్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ముందుగా మారెమ్మ దేవతకు పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో వాల్మీకి సంఘం నాయకులు నీరుగంటి శ్రీనివాసులు, కావలి రవి మాట్లాడుతూ.. 63ఏళ్ల ఎస్టీ రిజర్వేషన్ కలను కూటమి ప్రభుత్వం నెరవెరిస్తే ప్రతివాల్మీకి రుణపడి ఉంటామని తెలిపారు. వాల్మీకుల చిరకాల కోరిక అయిన ఎస్టీ రిజర్వేషన్‌ను కూటమి ప్రభుత్వంతో నెరవేరుస్తుందని గట్టిగా విశ్వసిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, వాల్మీకుల కుల పెద్దలు ఎస్టీ సాధన జరిగేలా మరింత సహకారం అందించాలని కోరారు.

రామాలయానికి ఎమ్మెల్యే విరాళం

యాడికి, మార్చి9(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్షుంపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయానికి తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అశ్మిత్ రెడ్డి లక్ష రూపాయలు విరాళం అందించారు. తాడిపత్రి పట్టణంలో ఆదివారం ఆయన ఈ మొత్తాన్ని ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలకు అందజేశారు.

ఉమ్మడి జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక

గుంతకల్లుటౌన్, మార్చి9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో రైల్వే క్రీడామైదానంలో ఆదివారం ఉమ్మడి అనంతపురం జిల్లా సబ్ జూనియర్ బాలుర, బాలికల కబడ్డీ జట్లను ఎంపిక చేసినట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రెటరీ లక్ష్మణ్, సెలక్షన్ కమిటీ సభ్యుడు రాఘవేంద్రతెలిపారు. బాలికల జట్టులో 12 మంది, బాలుర జట్టులో13మందిని ఎంపిక చేశామన్నారు. ఈనెల 14నుంచి 16వ తేదీ వరకు కడప జిల్లా పులివెందలలో జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలో బాలికలు, బాలురు జట్ల సభ్యులు పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో సీఐలు మనోహర్, మస్తాన్, ప్రవీణ్‌కుమార్, పీఈటీలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు తాడిపత్రి క్రీడాకారులు


అర్షియ, నవ్యశ్రీ

తాడిపత్రి: గుంతకల్లు పట్టణంలో ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ వారు నిర్వహించిన 36వ కబడ్డీ సబ్ జూనియర్ పోటీల్లో తాడిపత్రికి చెందిన అర్షియ, నవ్యశ్రీలు ప్రతిభ చూపారు. పట్టణంలోని సంజీవనగర్‌లో ఉన్న సాయిచైతన్య పాఠశాల విద్యార్థినులు అర్షియ, నవ్యశ్రీలు పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల కరెస్పాండెంట్, కోచ్ లక్ష్మి నరసింహ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కరెస్పాండెంట్‌తోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.

అంతర్జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు పీడీ


గోల్డ్‌మెడల్‌తో పీడీ అయూబ్ ఖాన్

విడపనకల్లు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని గడేకల్లు జిల్లా పరిషత్ హైస్కూల్ పీడీ అయూబ్ ఖాన్ అంతర్జాతీయ మాస్టర్స్ అసోసియేషన్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. గత ఫిబ్రవరి 8, 9వ తేదీలలో అనంతపురంలో జరిగిన రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అసోసియేషన్ అథ్లెటిక్ పోటీలలో ఆయన 50 ప్లస్‌లోని పురుషుల విభాగంలో మొదటి స్థానం సాధించి జాతీయ స్థాయిలో మాస్టర్ అథ్లెటిక్ పోటీలకు ఎంపిక అయ్యారు. ఇక ఈనెల 4 నుంచి 9వ తేదీ వరకూ బెంగళూరులోని కంఠీరవ స్టేడియంలో జాతీయ స్థాయి మాస్టర్స్ అసోషియేషన్ అథ్లెటిక్ పోటీలు నిర్వహించగా 3 కిలోమీటర్ల విభాగంలోని స్టీపుడ్ చేర్స్‌లో ప్రథమ స్థానంలో గెలుపొంది గోల్డ్ మెడల్ సాధించారు. ఆయన అంతర్జాతీయ స్థాయిలోని ఇండోనేషియాలో జరిగే ఆసియన్ మాస్టర్ అథ్లెటిక్ చాంపియన్ షిప్‌లో పాల్గొనున్నారు. ఇందుకు పాఠశాల ఉపాధ్యాయులు ఆదివారం అభినందించారు.

జిల్లాస్థాయిలో రాణించడమే లక్ష్యం

- పది ఫలితాల్లో ఉత్తీర్ణత పెంచడానికి శ్రమిస్తున్న ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు
- విద్యార్థులకు పరీక్షలపై పదును


కూడేరు ఉన్నత పాఠశాలలో విద్యార్థుల స్టడీస్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓ

కూడేరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే పదో తరగతి పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించి జిల్లాలోని టాప్ టెన్‌లో స్థానాన్ని మండలానికి దక్కించు కోవడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు పదును పెడుతున్నారు. ఈ క్రమంలో పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెంచడానికి తీవ్ర కృషి చేస్తున్నారు. అందుకు సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు స్టడీ అవర్స్ నిర్వహించి, ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో పదో స్థానంలో కూడేరు మండలం నిలవడానికి సర్వశక్తులూ ఒడ్డుతున్నారు. మండలంలో కేజీబీవీపాటు ఆరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. 2022-2023 విద్యా సంవత్సరంలో 336 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తే, కేవలం 122 మంది పాసై 36శాతం ఉత్తీర్ణత వచ్చింది. 2023-2024వ సంవత్సరంలో విద్యాశాఖ ఉత్తీర్ణతపై దృష్టి పెట్టడంతో 319 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తే 224 పాసై 70శాతం ఉత్తీర్ణత సాధించి జిల్లాలోనే కూడేరు మండలం పదో స్థానంలో నిలిచింది. ఈ ఏడాది మండల వ్యాప్తంగా ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో కూడేరులో 113 మంది, కమ్మూరులో 13 మంది, జల్లిపల్లిలో 31 మంది, కొర్రకోడులో 15 మంది, మరుట్లలో 32మంది, కరుట్లపల్లిలో 36 మంది, కేజీబీవీలో 39 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలకు సిద్ధమవుతున్నారు.

నేలపైనే చదువులు... వెలుగులు లేని గదులు

మండలంలోని చాలా పాఠశాలల్లో సరైన సౌకర్యాలు లేవు. విద్యార్థులు కూర్చోవడానికి బల్లలు లేక నేలపైనే చదువులు సాగిస్తున్నారు. దీనికి తోడు గదులు కొరత మరింత వేధిస్తోంది. ముఖ్యంగా మండలకేంద్రంలోని, కొర్రకోడులోని ఉన్నత పాఠశాలల్లో ఈ పరిస్థితి నెలకొంది. ఇక కరుట్లపల్లి, మరుట్ల ఉన్న పాఠశాలల్లో కూడా అరకొర సౌకర్యాలతో విద్యార్థులు చదువులు సాగిస్తున్నారు.

ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చేందుకు శ్రమిస్తున్నాం...



పదోతరగతి ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించి జిల్లాలోనే కూడేరు మండలానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నాం. మండలంలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు అందుకు శ్రమిస్తున్నారు. మార్చి 17వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభమవుతాయి. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎటువంటి భయం లేకుండా ప్రశాంతంగా రాయడానికి అవగాహన కల్పిస్తున్నాం.

-సాయికృష్ణ ఎంఈఓ-2, కూడేరు

సింహవాహనంపై చెన్నకేశవుడు


విద్యుద్దీపాలంకరణలో చెన్నకేశవస్వామి ఆలయం


ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు

యాడికి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శివలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారు సింహవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత అర్చకులు ఆలయంలో స్వామి వారి మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకరణలు, పూజలు చేశారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారి ఉత్సవమూర్తులను సింహవాహనంపై కొలువుదీర్చి ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం

శెట్టూరు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొచ్చుపల్లి గ్రామంలో ఆదివారం పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, గోవింద మాంబ కల్యాణోత్సవాన్ని గ్రామస్థులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఆలయంలో ఉదయం నుంచి గణపతి పూజ తదితర కార్యక్రమాలను జరిపారు. అనంతరం ఉత్సవవిగ్రహాలను పట్టు వస్త్రాలతో అలంకరించి వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణం జరిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పీ4 సర్వేతో సంక్షేమ పథకాలకు కోత: సీపీఎం


మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్

గుంతకల్లు టౌన్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలకు కోత వేసేందుకు పీ4 సర్వే చేపడుతోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్ విమర్శించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన పార్టీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వం ప్రస్తుతం చేపడుతున్న పీ4 సర్వే పేదలకు సంక్షేమ పథకాలకు దూరం చేయడానికేనని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఎనిమిది నెలలైనా ఎన్నికల హామీలను అమలు చేయలేదని మండిపడ్డారు. విద్యుత్ చార్జీలు పెంచలేదని శాసనసభలో మంత్రి రవికుమార్ చెప్పడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయాలన్నారు. లేకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి మారుతీప్రసాద్, పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు సాకే నాగరాజు, కసాపురం రమేష్, జగ్గలిరమేష్, సురేంద్ర, రంగమ్మ, గుత్తికార్యదర్శి నిర్మల పాల్గొన్నారు.

అనంతపురానికి చేరిన పాదయాత్ర


కూడేరులో పాదయాత్ర చేస్తున్న రైతు సంఘం నాయకులు

కూడేరు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): రైతు సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న పాదయాత్ర ఆదివారం కూడేరు, అరవకూరు తదితర గ్రామాల మీదుగా సాగి అనంతపురం చేరుకుంది. ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడు తూ.. రాష్ట్ర ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాల్లో భాగంగా అన్నదాత సుఖీభవ పథకం రైతులకు ప్రకటించిందని, ప్రతి రైతుకు పథకాన్ని వెంటనే వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లప్ప, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, పండ్లతోటల సంఘం జిల్లా అధ్యక్షుడు శివారెడ్డి, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యాడికిలో చికెన్ వ్యాపారుల వార్

- ధరల తేడాలతో వాగ్వాదం
- పోలీస్‌స్టేషన్ దాకా వెళ్లిన పంచాయితీ

యాడికి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో చికెన్ వ్యాపారుల మధ్య ధరల యుద్ధం నడుస్తోంది. ఇక్కడ 20మందికిపైగా చికెన్ వ్యాపారులు ఉన్నారు. కాగా పాత పోలీస్‌స్టేషన్ సమీపంలోని ఒక వ్యాపారి మిగతా వ్యాపారుల కన్నా కిలో చికెన్‌ను రూ.40 తక్కువ ధరకు విక్రయిస్తున్నాడు. దీంతో మిగిలిన వ్యాపారుల వద్ద కొనుగోళ్లు తగ్గిపోయాయి. దీనిపై ఆ వ్యాపారులంతా గత గురువారం రాత్రి తక్కువ ధరలకు విక్రయిస్తున్న వ్యాపారి వద్దకు వెళ్లి తక్కువ ధరకు ఎలా విక్రయిస్తావంటూ వాగ్వాదానికి దిగారు. అందరితో సమానంగా చికెన్ విక్రయించాలని హెచ్చరించారు. దీంతో తక్కువ ధరకు చికెన్ విక్రయిస్తున్న వ్యాపారి 'నాకు.. మీలాగా ఎక్కువ లాభాలు అవసరం లేదు. కిలో చికెన్‌పై రూ.10 మిగిలినా చాలు. నా షాపు.. నా ఇష్టం వచ్చినట్లు అమ్ముకుంటా. నేను తక్కువ లాభానికి చికెన్ అమ్ముతాను. మీరు ఏమైనా చేసుకోండి' అంటూ గట్టిగానే సమాధానం ఇచ్చి పంపాడు.

అందరి వద్ద కిలో రూ.180

అతడి వద్ద రూ.140

మండలకేంద్రంలోని చికెన్ వ్యాపారులంతా కిలో చికెన్ రూ.180లకు విక్రయిస్తే పాత పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న వ్యాపారి మాత్రం కిలో రూ.140 నుంచి 150లకు మాత్రమే విక్రయించడం గమనార్హం. దీనిని తెలుసుకున్న వినియోగదారులు చికెన్ విక్రయాల్లో ఇంత మోసం జరుగుతోందా అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తక్కువ ధరకు విక్రయిస్తున్న వ్యాపారికి స్థానికులు మద్దతు పలకడం గమనార్హం. దీనిపై పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన చికెన్ వ్యాపారులకు చుక్కెదురైనట్లు తెలిసింది. ప్రజలకు తక్కువ ధరకు విక్రయిస్తే మంచిదే కదా. అతడికి వచ్చిన లాభం మీకెందుకు రాదు అంటూ పోలీసులు ప్రశ్నించినట్లు సమాచారం. వారంరోజుల్లో యాడికి తిరుణాల ఉంది. చికెన్ వ్యాపారం పెద్ద ఎత్తున జరుగుతుంది. చికెన్ వ్యాపారుల మధ్య బేధాభిప్రాయాలతో ఈ గొడవ ఎక్కడికి దారి తీస్తుందోనని స్థానికులు చర్చించుకుంటున్నారు.

ఆటో బోల్తా.. యువకుడి మృతి


బోయ శ్రీకాంత్ (ఫైల్)

గుమ్మఘట్ట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోనబావి క్రాస్ వద్ద గల రాయదుర్గం - బీటీపీ రహదారిలో ఆటో బోల్తా పడి బోయశ్రీకాంత్(24) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. బ్రహ్మసముద్రం మండలం ఎర్రటికర గ్రామానికి చెందిన బోయ శ్రీకాంత్ రాయదుర్గం పట్టణంలోని కూరగాయల మార్కెట్‌కు శనివారం అర్ధరాత్రి ఆటోలో బయలుదేరాడు. గోనబావి క్రాస్ వద్దకు రాగానే ఆటో బోల్తా పడింది. ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీకాంత్ మద్యం మత్తులో ఆటోను వేగంగా నడపడం వల్లే ప్రమాదం జరిగిందని ఎస్ఐ ఈశ్వరయ్య తెలిపారు. మృతుడికి భార్య, రెండేళ్ల కుమారుడు ఉన్నారు. ప్రస్తుతం భార్య ఐదునెలల గర్భిణి. కుటుంబసభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

బెళుగుప్ప, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నక్కలపల్లి క్రాస్ వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. కణేకల్లుకు చెందిన ఆర్టీటీ ఉద్యోగి రాంప్రసాద్ బైకుపై బెళుగుప్ప నుంచి స్వగ్రామానికి వెళుతున్నాడు. నక్కలపల్లి క్రాస్ వద్దకు రాగానే బెళుగుప్పకు చెందిన రాజశేఖర్ మరో బైకుపై ఎదురుగా వేగంగా వచ్చాడు. దీంతో చీకటిలో సరిగా కనపడక ఆ రెండు బైక్‌లు పరస్పరం ఢీకొన్నాయి. ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

యర్రగుంటపల్లి సమీపంలో ఒకరికి..

తాడిపత్రి: మండలంలోని యర్రగుంటపల్లి గ్రామ సమీపంలో ఆదివారం ద్విచక్రవాహనం లారీని ఢీకొనడంతో రామయ్య అనే వ్యక్తి గాయపడ్డాడని రూరల్ పోలీసులు తెలిపారు. రామయ్య పట్టణంలోని అనంతపురం రోడ్డులో గల ఓ పెట్రోల్ బంకులో పంప్‌బాయ్‌గా పనిచేస్తున్నాడు. కాగా కొందరు కారులో వచ్చి పెట్రోల్ పట్టించుకొని డబ్బులు ఇవ్వకుండా వెళ్లిపోయారు. గమనించిన రామయ్య వెంటనే బైక్‌లో కారును వెంబడించే ప్రయత్నం చేశాడు. కానీ కారు అప్పటికే వేగంగా వెళ్లిపోయింది. కారును పట్టుకునే క్రమంలో వేగంగా వచ్చిన రామయ్య యర్రగుంటపల్లి గ్రామం వద్ద నిలిచి ఉన్న లారీని ఢీకొట్టాడు. ప్రమాదంలో కాలికు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదుచేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నేటి నుంచి రక్తదాన శిబిరం

గుంతకల్లుటౌన్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో సోమవారం నుంచి 16వ తేదీవరకు రోట్రాక్ క్లబ్, రోటరీ క్లబ్ సంయుక్తంగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ఎలైట్స్ రోట్రాక్టర్ నాగార్జున, రోటరీ క్లబ్ అధ్యక్షుడు శివానంద ఆదివారం ప్రకటనలో తెలిపారు. మహాదాన్ 10 ఓలో భాగంగా ప్రపంచవ్యాప్తంగా అన్ని రోట్రాక్ క్లబ్‌లు వారం రోజులు పాటు రక్తదాన శిబిరాలు నిర్వహించనున్నాయని అన్నారు. ఇందులో ప్రతిఒక్కరూ రక్త దానం చేసి ప్రాణదాతలు కావాలని పిలుపునిచ్చారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


శ్రీకాంత్ (ఫైల్)

కళ్యాణదుర్గం రూరల్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు శ్రీకాంత్ (22) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. కర్ణాటకలోని బళ్లారికి చెందిన శ్రీకాంత్ కళ్యాణదుర్గం పట్టణానికి ఎల్లమ్మ దేవరకు రెండు రోజుల కిత్రం వచ్చాడు. అయితే గత శనివారం సాయంత్రం పట్టణానికి చెందిన బంధువు సంతోష్, అతను కలిసి బైక్‌లో ఓ మామిడితోటవద్దకు వెళ్లారు. కొద్దిసేపటి తర్వాత తిరిగి ఇంటికి వస్తుండగా హిందూపురం బైపాస్ రోడ్డు వద్ద అదుపుతప్పి బోల్తాపడ్డారు. ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. శ్రీకాంత్ పరిస్థితి విషమంగా వుండటంతో బళ్లారి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడు జిందాల్ ఫ్యాక్టరీలో పనిచేసేవాడు. అతడికి తండ్రి గోవిందు, తల్లి సాకమ్మ ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

బాధితుడికి ఎమ్మెల్యే పరామర్శ


ఆస్పత్రిలో బాధితుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని

కళ్యాణదుర్గం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోరేపల్లికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు హనుమంతరాయుడు అనారోగ్యంతో అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆదివారం ఆస్పత్రికి వెళ్లి అతడిని పరామర్శించారు. ఆరోగ్యంపై, అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. అనంతరం అక్కడే ఉన్న వైద్యులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ధైర్యంగా ఉండాలని, అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఆయన వెంట నాయకులు రాజగోపాల్, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


నాటి అధ్యాపకులతో పూర్వ విద్యార్థులు

కళ్యాణదుర్గంరూరల్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. 1992-95 విద్యాసంవత్సరాల్లో ఆ కళాశాలలో డిగ్రీ చదివిన విద్యార్థులంతా మళ్లా ఇన్నేళ్లకు కలిశారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలడిగి తెలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. నాటి అధ్యాపకులు జయరామిరెడ్డి, చెంగలయ్య, సురేష్, నాగరాజురావు, ఎంవీ శేషయ్య, రాధాకృష్ణ, చక్రవర్తి తదితరులను ఘనంగా సన్మానించారు. అనంతరం పూర్వ విద్యార్థులు దాండియా, కోలాటం ఆడుతూ అలరించారు.

తాగునీటి సమస్య నివారణకు చర్యలు

గుత్తి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలో పలు వార్డుల్లో వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ జబ్బర్‌మియా ఆదివారం ప్రకటనలో తెలిపారు. తాగునీటి సమస్య నివారణ కోసం పీఎంఎఫ్ పథకం కింద రూ.90లక్షలు నిధులు మంజురయ్యాయన్నారు. వాటితో పట్టణంలో అవసరమైన చోట బోర్లు వేయడంతో పాటు ఇప్పటికే ఉన్న బోర్ల మరమ్మతులను చేపడతామన్నారు. తాగునీటి నివారణ కోసం ప్రభుత్వానికి మరిన్ని నిధుల కోసం ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు.

ప్రభుత్వాస్పత్రికి ఫొటో థెరపీ యంత్రం వితరణ


కార్యక్రమంలో పాల్గొన్న జేసీపీఆర్

తాడిపత్రి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి పెన్షనర్ల అసోసియేషన్ సభ్యులు రూ.50వేలు విలువ గల ఫొటో థెరపీ యంత్రాన్ని ఆదివారం మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి చేతుల మీదుగా ఆసుపత్రి సూపరిండెంట్ డేవిడ్‌కు అందజేశారు. ఫోటోథెరపీ పరికరం ద్వారా రోగులకు మెరుగైన సేవలు అందుతాయని జేసీపీఆర్ తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీనివాసులరెడ్డి, పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు సత్యప్రసాద్‌రెడ్డి, సభ్యులు హనుమంతరెడ్డి, వీరారెడ్డి, గోపాల్‌రెడ్డి, అశ్వత్థరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆవిర్భావ సభను జయప్రదం చేయండి: జనసేన

గుంతకల్లు/ఉరవకొండ, మార్చి 9(ఆంధ్రజ్యోతి): జనసేన ఆవిర్భవించిన 11 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పిఠాపురంలో ఈనెల 14వ తేదీన ఆవిర్భావ సభ జరగనుందని, నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులు పెద్దఎత్తున తరలివెళ్లి విజయవంతం చేయాలని ఆ పార్టీ సీనియర్ నాయకుడు పూల రమణ పిలుపునిచ్చారు. ఈమేరకు పట్టణంలో ఆదివారం ఉదయం ఆయన సభకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు గోవింద రాజులు, బద్రి, బాలాజీ, గోపి, బాలు, శారద, నారాయణమ్మ, శ్రీనివాసులు, ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు. అలాగే ఉరకొండ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి గౌతమ్ పోస్టర్లను విడుదల చేశారు. ఆవిర్భావ సభకు నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. నాయకులు చంద్రశేఖర్, సుధీర్, రమేష్, మణికుమార్, నీలకంఠ పాల్గొన్నారు.

బీజేపీలోకి 50 మంది చేరిక


బీజేపీలో చేరిన వారితో నాయకులు

కణేకల్లు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాల్యం గ్రామానికి చెందిన దాదాపు 50 మంది బీజేపీలోకి చేరారు. మండలకేంద్రంలోని చిక్కణ్ణేశ్వర కల్యాణమండపంలో ఆదివారం వారు బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్, సీనియర్ నాయకుడు చిరంజీవిరెడ్డి సమక్షంలో, గ్రామ నాయకుడు నరేంద్రస్వామి ఆధ్వర్యంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి కొనకొండ్ల రాజేష్, చిరంజీవిరెడ్డి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. బీజేపీ మండల కన్వీనర్ కురుబ తిప్పేస్వామి, నాయకులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలుతున్న మద్యం పట్టివేత

- పట్టింది 144 పైగా బాటిళ్లు.. చూపింది 52 మాత్రమే?

పుట్లూరు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్లోపల్లి గ్రామశివారులో శనివారం అర్ధరాత్రి అక్రమంగా మద్యం తరలిస్తుండగా మూడు కేసుల క్వార్టర్ బాటిళ్లను పట్టుకున్నట్లు సమాచారం. కానీ పోలీసులు మాత్రం 52క్వార్టర్ బాటిళ్లను మాత్రమే పట్టుకున్నట్లు ఆదివారం చూపారని విశ్వసనీయ సమాచారం. ఈ కేసులో ఓ పోలీసు అధికారి చక్రం తిప్పినట్లు ప్రచారం జరుగుతోంది. సుమారు 144పైగా మద్యం బాటిళ్లు పట్టుకోగా.. కేవలం 52మాత్రమే చూపించడం వెనుక అంతర్యమేమిటోనన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మరోవైపు మద్యం తరలిస్తున్న ఆటోను సైతం విడిచిపెట్టారని తెలుస్తోంది. ఈ విషయంపై ఏఎస్ఐ రాజశేఖర్‌ను వివరణ కోరగా 52మద్యం బాటిళ్లు మాత్రమే స్వాధీనం చేసుకొని కోమటికుంట్లకు చెందిన నరసింహులుపై కేసు నమోదుచేశామని తెలిపారు. కడవకల్లు నుంచి కోమటికుంట్లకు మద్యం తరలిస్తుండగా పట్టుకున్నట్లు చెప్పారు.


ఐసీసీ చాంపియన్ ట్రోఫీలో భారత్ జట్టు విజేతగా నిలిచిన సందర్భంగా ఆదివారం రాత్రి కణేకల్లు మండలకేంద్రంలోని ఎన్టీఆర్ సర్కిల్లో అభిమానులు సంబరాలు చేశారు. బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచారు.